# అప్పుడే యవ్వనం?

■ మాపాప వయసు 8 ఏళ్లు. జననావయవాలు, బాహుమూలల్లో వెంట్రుకలు వచ్చాయి. కుడివైపు వక్షోజం దగ్గర చిన్న కణతిలా మొదలై, పెరగటం మొదలుపెట్టింది. ఇంతచిన్న వయసులో రజస్వల అయితే.. మానసికంగా, సామాజికంగా ఇబ్బందులు చాలా ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళనగా ఉంది. ఇదేమైనా హార్మోన్ల సమస్యా? ఈ సమస్యకి పరిష్కారం ఏమిటి?

-ఎ.ఎస్., ఖమ్మం



డా॥.కె.డి.మోడి
ఎండోక్రినాలజిస్ట్
మెడ్విన్ హాస్పిటల్
హైదరాబాద్

● ఎనిమిదేళ్ల వయసులోనే ఇలా జననావయవాల దగ్గర వెంట్రుకలు పెరగటాన్ని 'ప్రికోసియస్ ప్యూబర్టీ' అంటారు. మీ పాపకు అన్నిరకాల వైద్య పరీక్షలు చేయించాలి. ప్రికోసియస్ ప్యూబర్టీ అనేది గ్రంథులు, హార్మోన్లకు సంబంధించిన సమస్య. దీనివల్ల ఆడపిల్లలకు మొదట్లో ఎదుగుదల (గ్రోత్ స్పర్ట్) చాలా ఎక్కువగా అనూహ్యంగా ఉంటుంది. సాధారణ ఆరోగ్యవంతులైన పిల్లల ఎదుగుదలతో పోలిస్తే.. ఇలాంటి పిల్లల్లో ఎదుగుదల వేగంగా మొదలవుతుంది, అధికంగా ఉంటుంది. ఫలితంగా వీరిలో యుక్తవయసు తర్వాత అతుక్కోవాల్సిన ఎముక భాగాలు కూడా ముందుగానే అతుక్కుపోతాయి. దీంతో వీరిలో కొన్నాళ్లకి ఎదుగుదల ఆగిపోతుంది. మిగతా చిన్నారులు 11 ఏళ్లు దాటినా ఎదుగుదల కొనసాగుతుంటే.. వీరిలో మాత్రం ముందే నిలిచిపోతుంది. చివరికి వీరు ఎత్తు తక్కువగా, పొట్టిగా ఉండిపోయే అవకాశం ఉంది. అందుకని.. ఇలాంటి సమస్యకు చికిత్స తప్పనిసరి. ఇలాంటి ముందస్తు యవ్వనారంభాన్ని నెలవారీ జీఎన్ఆర్‌హెచ్ అనలాగ్ ఇంజక్షన్లతో అణచి ఉంచవచ్చు అయితే.. చికిత్స ప్రారంభించటానికి ముందుగా ఇది కచ్చితంగా ప్రికోసియస్ ప్యూబర్టీయే అనేది నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ఇందులో రెండురకాలు ఉంటాయి. ఒకటి- సెంట్రల్ ప్రికోసియస్ ప్యూబర్టీ. దీనిలో సమస్య పిట్యుటరీ లేదా హైపోథాలమస్ గ్రంథుల నుంచి మొదలవుతుంది. రెండోది- పెరిఫెరల్ ప్రికోసియస్ ప్యూబర్టీ. దీనిలో అండాశయాలు, హైపోథైరాయిడిజం వంటివి కారణమవుతాయి. ఎండోక్రినాలజిస్టును సంప్రదించి, ప్రారంభ దశలోనే చికిత్స మొదలు పెట్టటం మంచిది. వీరిలో ఎత్తు పెరగటమనేది ఆగిపోవటమే కాకుండా సామాజిక సమస్యలూ తలెత్తుతాయి. ఇలాంటి బాలికలు చిన్న వయసులోనే రజస్వల అవ్వటం వల్ల యుక్తవయసు అమ్మాయిల్లా కనిపించినా, మానసికంగా వారిలో చిన్నపిల్లల మనస్తత్వమే ఉంటుంది. ఇది రకరకాల సామాజిక, లైంగిక వేధింపుల వంటి సమస్యలకు దారితీస్తుంది.

## థైరాయిడ్‌తో.. నీరు!

■ నా వయసు 52 సంవత్సరాలు. గతంలో ఆపరేషన్ చేసి, రెండు వైపులా థైరాయిడ్ పూర్తిగా తీసివేశారు. ఆపరేషన్ తర్వాత రోజూ ఒక మాత్ర వేసుకోమన్నారు. పదిరోజులు మాత్రలు వాడగానే ఒంట్లో నీరు చేరింది. డాక్టర్‌ని కలిస్తే.. కొన్నాళ్లపాటు రోజుకు మూడు మాత్రల చొప్పున వాడాను. తర్వాత ఒకటిన్నర మాత్రల చొప్పున వాడుతున్నాను. నీరు చేరటం తగ్గలేదు. డ్యూటీకి వెళ్లటం ఇబ్బందిగా ఉంది. సమస్య తగ్గేదెలా?

-సత్యనారాయణ, దోసపాడు


● థైరాయిడ్ మాత్రల మోతాదుల్ని పదీ పదిహేను రోజులకే మార్చకూడదు. నీరు చేరుతోందనీ, మరేవో ఇబ్బందులున్నాయని తరచూ మాత్రల్ని మార్చకూడదు. ఎందుకంటే.. మాత్రలు వేసుకోవటం మొదలుపెట్టిన తర్వాత వాటి ప్రభావం కనిపించటానికి కనీసం ఆరు వారాలైనా చూడాలి. ఆ తర్వాత పరీక్షలు చేయించి, దానిని బట్టి మందుల మోతాదు పెంచాలా? వద్దా? అనేది నిర్ణయించుకోవచ్చు.

థైరాయిడ్ బాధితుల్లో ఒంట్లో నీరు చేరటం మామూలే. దీనిని 'నాన్ పిటింగ్ ఎడీమా'గా వ్యవహరిస్తారు. అంటే.. నీరుచేరి ఉబ్బిన శరీరంపై నొక్కినా గుంతలు కనిపించవు. మీరు ఇప్పుడు వాడుతున్న ఒకటిన్నర మాత్రను అదేవిధంగా కొనసాగించండి. దీనితోపాటు ఒంట్లో నీరు చేరటానికి ఇతరత్రా కారణాలేమైనా తోడవుతున్నాయా? అనేదీ పరిశీలించాలి. హిమోగ్లోబిన్, యూరిన్ ప్రొటీన్ వంటివి పరీక్షించాలి. ఎందుకంటే.. ఒంట్లో నీరు చేరటానికి ఎన్నో కారణాలు తోడవుతాయి. థైరాయిడ్ కారణంగానే ఎడీమా వచ్చినట్లయితే.. మందులు ఆరంభించిన ఆరు వారాలకు తగ్గిపోతుంది. అప్పటికీ తగ్గకపోతేనే మందుల మోతాదు పెంచటం వంటివి ఆలోచించవచ్చు. అప్పటిదాకా ప్రస్తుతం వాడుతున్న మోతాదుల్లోనే వాడటం మంచిది.

## ఇది తీవ్ర సమస్యే

■ నా స్నేహితురాలి వయసు 20 సంవత్సరాలు. చాలా పొట్టిగా ఉంటుంది. థైరాయిడ్ సమస్యతో బాధపడుతోంది. మందులు కూడా వాడుతోంది. ఇప్పటికీ రజస్వల కాలేదు. థైరాయిడ్ సమస్యకీ, దీనికీ సంబంధం ఉందా? థైరాయిడ్ తగ్గితే, రజస్వల అవుతుందా? ఈ సమస్యకు చికిత్స ఏమిటి?

-ఒక పాఠకురాలు, శ్రీకాకుళం



సమస్య + సలహా

● 20 ఏళ్ల వయసు వచ్చినా రజస్వల కాకపోవటం తీవ్రమైన సమస్యగానే భావించాలి. మీ స్నేహితురాలు రజస్వల కాకపోవటమే కాకుండా, పొట్టిగా కూడా ఉందంటున్నారు కాబట్టి తప్పనిసరిగా గ్రోత్ హార్మోన్ సమస్య ఉందేమో చూడాలి. ఇది థైరాయిడ్ సంబధ సమస్య కాకపోవచ్చు. అండాశయాలు, హార్మోన్లకు సంబంధించిన సమస్య అయ్యుంటుంది. గైనకాలజిస్టును సంప్రదించి, అవసరమైన హార్మోన్ పరీక్షలు చేయించుకోవటం మంచిది. దీనికోసం ఎల్ఎస్‌హెచ్, ఎఫ్ఎస్‌హెచ్ వంటి హార్మోన్ పరీక్షలు అవసరమవుతాయి. ఇలాంటి సమస్యలు సాధారణంగా థైరాయిడ్ కారణంగా తలెత్తవు. కొంతమందిలో రజస్వల అవ్వటం కాస్త ఆలస్యం కావచ్చు. అయితే.. 20 ఏళ్లయినా రజస్వం కాకపోవటం మాత్రం కాస్త తీవ్రమైన సమస్యగానే పరిగణించాలి. కొన్ని సందర్భాల్లో 'టర్నర్స్ సిండ్రోమ్' వంటివీ కారణమవుతాయి. ఎక్కువ సందర్భాల్లో థైరాయిడ్ సమస్య ఉన్నప్పుడు, దానికి సంబంధించిన లక్షణాలు కనిపిస్తే అవసరమైన పరీక్షలు చేయించి, చికిత్స చేస్తారు. టర్నర్స్ సిండ్రోమ్ లాంటివి ఉన్నా గుర్తించే పరిస్థితి ఉండదు. అందుకని సమగ్ర పరీక్షలు అవసరం.